# బతకతగనిది!

[చిన్న కథ.]

'అమ్మా! నిజమే గాని, డాక్టరుకూడా మనిషే. వాడు జంతువు గాని, యంత్రం గానికాదు. చూస్తూ ఒక యిల్లాలు మాతృత్వం చంపుకుంటోందంటే...'

రచయిత.

## గుంటూరు సత్యనారాయణ, ఎం. ఏ.

'విన్నారా? అదీ ఆమె కింప్లైంటు...నాకూ ఇష్టంలేదు సుమండీ, చెప్పొద్దూ! ..ఇంకా మా పెళ్ళయి వన్ ఇయరేనా కాలేదు, అప్పుడే పిల్లలేమిటండీ!' అన్నాడు రామారావు. అతడికి ముప్ఫైఅయిదేళ్లుంటాయి. అవూళ్ళో మ్యునిసిపల్ కమీషనరుగా పనిచేస్తున్నాడు. భార్యకు ఇరవైఐదుంటాయి- స్కూలు హెడ్ మిస్ట్రెస్సుగా ఉంది. పాశ్చాత్యవిధానానుకరణంలో ఆ ఊరి దాంపత్యాలదే మొదటి బహుమతి.

డాక్టర్ మోహనరావు నవ్వుతూ: 'మీలాంటి చదువుకున్నవాళ్ళే ఇలాటినీచపు సలహాలకు వస్తే...'

రామారావు మొహం చిట్లిస్తూ: 'మీరు పొరబడుతున్నారు బర్త్ కంట్రోల్ ఎంత ప్రాముఖ్యం పొందుతోంది ఈరోజుల్లో ...'

'ఇది బర్త్ కంట్రోల్ కాదు, హత్య ఆ సిద్ధాంతంమీద నమ్మకం వున్నవాళ్లు పెళ్ళెందుకు చేసుకోవాలీ? ఉత్తమ బ్రహ్మచర్యం అవలంబించరాదూ? దాంపత్యసుఖం కోరేవాళ్లు, ఈ పన్నెండుకు చెయ్యాలీ?'

ఇంతలో కారులో మిసెస్ రామారావు దిగింది. రామారావామెనిచూసి నవ్వుతూ 'డియర్! డాక్టరుగారు వొట్టి పూర్వాచారి సుమా! పిచ్చి నమ్మకాలు చాలా ఉన్నాయి! నీకేసు తీసుకునేలా కనుపించడం లేదు.'

ఉగ్రురాలైపోయింది: 'ఏం? పాపం, పుణ్యం అని లెక్చరు కొడుతున్నారేమిటి? ...డాక్టర్...మీ దగ్గరకు వేదాంతంకోసం వొచ్చేంవా, సలహాకొచ్చేంగాని?'

'అమ్మా, నిజమేగాని, డాక్టరు కూడా మనిషే. వాడు జంతువు గాని, యంత్రంగానికాదు. చూస్తూ ఒకయిల్లాలు మాతృత్వం చంపుకుంటోందంటే...'

'ఓ! నాన్సెన్స్! డాక్టర్, ఇలాటి పెద్దపెద్ద మాటలక విలువలేదప్పుడు! మాతృత్వంఏమిటి నా మొహం, ఈమూడో నెలకే ఇలా చస్తూంటే...'

మోహన్ మరి మాటాడలేదు. కొంతసేపు నిశ్శబ్దంగా ఊరుకొని, చిరునవ్వుతో 'ఆల్ రైట్, మిసెస్, రావ్! మిమ్మల్ని ట్రీట్ చెయ్యడానికి నాకేం అభ్యంతరం లేదు. చాలా సులువైనపనే, మూణ్ణెల్ల పిండాన్ని చంపడం. కాని మీరు చాలా నీరసించి పోతారు!' 'మరేం ఫరవాలేదు!!'-'ఓ. కే.'

* * *

'డాక్టర్! ఆమె బతుకుతుందా?' అన్నాడు రామారావు, నెలరోజుల తరువాతి ముచ్చట.

'ఏమో చెప్పలేను. చాలా ప్రమాదకరమైనస్థితిలో ఉంది. నా చేతనైనంతవరకు ప్రయత్నిస్తాను!'

* * *

ఆమె చచ్చిపోయిన తరువాత ......మోహన్ అన్నాడు: 'మిస్టర్ రామారావ్! మీరు మళ్ళీ వివాహం తలపెట్టకండి. ఆమె అసలు చచ్చిపోవలసింది కాదు, అంతకన్న ముఖ్యమైంది, ఆమె బతకతగనిది! అంచేత నేనే చంపేశాను!!...ఏం? అలాచూస్తారు... కోపంవొస్తోందా? .. మీ ప్రేమ బంధం తెంపేసేనుకాదూ? ...అహ్హాహ్హా!...ప్రేమ!...పిల్లల్ని ప్రేమించలేనివాళ్ళకు ... మాతృత్వమాధుర్యం తెలియనివాళ్ళకూ ప్రేమ అంటే అర్థమెలా తెలుస్తుందండీ?...ఆవిడ బతికిఉంటే ..ఇంకా...ఎన్ని జీవపిండాలు నశించిపోయి ఉండునో? ...అలా చూడకండి...నన్నేమీ చెయ్యలేరుమీరు ...నేను డాక్టర్ని...పేరుపడ్డ డాక్టర్ని...'